నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, గురువారం 23 మే 2024 SANGAREDDY



నంగునూరుకు చెందిన మాధవికి బీమా చెక్ అందజేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

## కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తాం

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

నంగునూరు, మే 22: బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకూ పార్టీ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించిందని, ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే వారి కుటుంబసభ్యులకు ఈ ప్రమాద బీమా సదుపాయం అండగా నిలిస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రతి కార్యకర్తలనూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 48 మందికి రూ.2 లక్షల చొప్పున రూ.96 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండేందుకే అధ్యక్షుడు కేసీఆర్ ఈ బీమా సదుపాయాన్ని కల్పించారన్నారు. బుధవారం నంగునూరు మండల కేంద్రానికి చెందిన సుంచనకోట యాదగిరి ఇటీవల ప్రమాదవశాత్తూ నీట మునిగి చనిపోయారు. వారి కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్‌ను హరీశ్‌రావు యాదగిరి భార్య మాధవికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ సునీతామహేందర్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉల్లి మల్లయ్య, యువజన నాయకుడు ఆకుబత్తిని రాము తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న హరీశ్‌రావు



సిద్దిపేటలో హనుమాన్ శోభాయాత్రలో పూజలు చేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, మే 22 : రామచంద్రుడు, ఆంజనేయ స్వామి ఆశీస్సులతో సిద్దిపేట పట్టణం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆకాంక్షించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో హనుమాన్ మాలధారణ స్వాములు నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో హనుమాన్ స్వాములు నిర్వహించిన శోభాయాత్ర సిద్దిపేటకే కొత్త శోభను తెచ్చిందన్నారు. ఆ భగవంతుడు అందరికీ ఆయురారోగ్యాలు అందించాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

**పెద్దమ్మ ఉత్సవాల్లో...**

నంగునూరు, మే 22: మండలంలోని రాజగోపాల్‌పేటలో జరుగుతున్న పెద్దమ్మ ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నర్మెటలో జరుగుతున్న కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం ఘనపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి భరోసానిచ్చారు.

## కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం
- రైతులు ఆందోళన చెందొద్దు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



దాయర కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మెదక్, మే 22 (నమస్తే తెలంగాణ): కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని, ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం మెదక్‌లోని దాయరలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాయరలో కొనుగోలు ప్రక్రియ తుదిదశలో ఉన్నందున త్వరితగతిన కొనుగోళ్లు పూర్తిచేసి మిల్లుకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2,22,082.120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 51,309 రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.355. 45 కోట్లు చెల్లించామని చెప్పారు. 108 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి అయిందన్నారు. జిల్లాలో మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 34 బైలేడ్ మిల్లులు, 31 రా మిల్లులకు ధాన్యం కేటాయించామని చెప్పారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేందుకు సిద్దిపేట జిల్లాకు 10,000 మెట్రిక్ టన్నులు, మహబూబ్‌నగర్ జిల్లాకు 40,000 మెట్రిక్ టన్నులు ధాన్యం పంపించామని చెప్పా రు. ఇప్పటివరకు జిల్లాలో సుమారుగా 600కు పైగా లారీలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యంగింజనూ కొనుగోలు చేస్తామన్నారు. కలెక్టర్ వెంట పౌర సంబంధాల అధికారి బ్రహ్మారావు, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## కొనుగోళ్లపై అధికారులు దృష్టి పెట్టాలి

**అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్**



సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సంగారెడ్డి, మే 22: ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యిందని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతిని కలిసి అన్నదాతల ఇబ్బందులను వివరించారు. అనంతరం కలెక్టరేట్ బయట విలేకరులతో మాట్లాడుతూ పదేండ్లలో ఎన్నడూ కూడా విత్తనాలు, ఎరువుల కొరత లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ పాతరోజులు వచ్చాయన్నారు. జోగిపేటలో మంగళవారం వానకాలం సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలకు విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో చెప్పులు, పట్టాపాసు పుస్తకాల జిరాక్సులు వరుసలో పెట్టారన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం అధికారులకు చెపుతున్నా వారిలో స్పందన లేకపోవడం విడ్డూరమన్నారు. సాగుకు ముందే రైతులకు ఎరవుల స్టాక్ వివరాలు తెలిసేలా అధికారులు ప్రచారం చేయాలని, మళ్లీ పాతరోజులు రాకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇటీవల నర్సాపూర్ ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన పంచాయతీ కార్యదర్శులు

# ఈ భారం మోయలేము..!

- ఐదు నెలలుగా పంచాయతీలకు రూపాయి నిధులు లేవు
- నెలనెలా వడ్డీలకు అప్పుతెచ్చి ఖర్చుచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- ఎంపీడీవోలకు వినతి పత్రాలు ఇచ్చి మొరపెట్టుకుంటున్న పీఎస్‌లు
- వేల రూపాయలు సొంతంగా పెట్టామని ఆవేదన
- ఇప్పటికే ఒక్కో చిన్న జీపీకి రూ. 60 వేలపైనే ఖర్చు
- పెద్ద జీపీలకు రూ.లక్షల్లోనే ఖర్చు చేసిన కార్యదర్శులు
- గ్రామాలకు చుట్టం చూపులా వచ్చి వెళ్తున్న ప్రత్యేకాధికారులు
- ఆర్థిక భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలు




సిద్దిపేట, మే 22( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గ్రామపం చాయతీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామంలోని చిన్న చిన్న సమస్యలను తీర్చాలాంటే జీపీల్లో రూపాయి బిల్ల లేదు. ఐదు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు రావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదు. ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. అప్పటి నుంచి గ్రామాలకు నిధులు రాకపోవడవడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతున్నది. పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో ఉన్న చిన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. తాము ఇక ఈ భారం మోయలేమని ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. ఇటీవల మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీవోకు తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఇక తాము సొంత డబ్బులు పెట్టి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించలేమని పేర్కొన్నారు. మరోవైపు పారిశుధ్య కార్మికులు జీతాలు రాకపోవడంతో పనిలోకి రామని ఖరాఖండీగా చెబుతున్నారు. జూన్ నుంచి తాము పనిచేయబోమని చెబుతున్నారు.

**పంచాయతీల్లో పడకేసిన పాలన**

సంగారెడ్డి జిల్లాలో 647, మెదక్ జిల్లాలో 469, సిద్దిపేట జిల్లాలో 499, ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 1,615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి జీపీకి పంచాయతీ కార్యదర్శిని నియమించింది. కార్యదర్శులపై ఆర్థిక భారం పడకుండా నెలనెలా పల్లెప్రగతి ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేసింది.దీంతో గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాయి. గ్రామానికి వచ్చే ప్రత్యేక నిధులతో పాటు ఇతర అభివృద్ధి నిధులతో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టేవారు. మొక్కల పెంపకం, పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా చేపట్టేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా గ్రామాలకు రూపాయి నిధులు విడుదల చేయలేదు. దీంతో పంచాయతీల్లో పాలన పడకేసింది.పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి వేతనాలు రావడం లేదు. జనవరి 31తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామాలకు ప్రత్యేకాధికారులు చుట్టపు చూపులా వచ్చివెళ్తున్నారు. సమస్యల పరిష్కారానికి వారు చొరవ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

**పంచాయతీ కార్యదర్శులపైనే ఆర్థిక భారం**

పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతున్నది. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ఐదు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామ స్థాయిలో ఏ చిన్న మీటింగ్ జరిగినా పంచాయతీ కార్యదర్శులే జేబు నుంచి డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలోని చిన్న చిన్న అవసరాలు తీర్చాలంటే వారే సొంతంగా డబ్బులు సమకూర్చాలిసి పరిస్థితి ఉంది. గ్రామాల్లో ప్రధానంగా ఇంటింటా చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను గ్రామంలోకి పంపాలంటే దానికి డీజిల్ పోయించాల్సి ఉంటుంది. ఒక్క చిన్న గ్రామ పంచాయతీకి లెక్క కట్టినా నెలకు ఎంత లేదన్నా డీజిల్‌కు రూ. 20వేల పైనే ఖర్చు అవుతున్నది. చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను పంపకపోతే గ్రామం అంతా కంపు కొడుతుంది. గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణ, బోర్ల రిపేరు, తాగునీటి పైప్‌ల రిపేరు, పైప్‌లైన్ లీకేజీ, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి ఎద్దడి ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, ఇలా ఎన్నో పనులు గ్రామాల్లో చూసుకోవాల్సి వస్తున్నదని పంచాయతీ కార్యదర్శులు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. ఐదు నెలలుగా పంచాయతీ కార్యదర్శులు కొందరు తమ వేతనాల నుంచి, మరికొందరు వ్యాపారుల వద్ద వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఒకవేళ డబ్బులు లేవు అని ...సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వం నుంచి, ఉన్నత స్థాయి అధికారుల నుంచి వేధింపులకు గురికావాల్సి వస్తున్నదని, తమను ఎక్కడ సస్పెన్షన్ చేస్తారేమోనని పంచాయతీ కార్యదర్శులు భయపడుతున్నారు. దీంతో సొంతంగా డబ్బులు ఖర్చుచేసి గ్రామాల్లో అవసరాలను తీర్చుతున్నారు. ఒక్కో చిన్న గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇప్పటికే రూ 60 నుంచి 80 వేలు సొంతగా ఖర్చు చేశాడు. మేజర్ గ్రామ పంచాయతీల్లో రూ.లక్షల్లోనే ఖర్చు పెట్టినట్లు తెలుస్తున్నది. తమకు వచ్చిన జీతం గ్రామాలకు పెట్టుకుంటూ పోతే తమ కుటుంబాలు పోషణ ఎలా గడిచేది ..? అని పంచాయతీ కార్యదర్శు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వారు కోరుతున్నారు.

# జీలుగ విత్తనాల కోసం రైతుల బారులు

రామాయంపేట, మే 22: జీలుగ విత్తనాల కోసం రైతులు బుధవారం రామాయంపేటలోని రైతు సేవాకేంద్రం, వ్యవసాయ కార్యాలయం, దుకాణాల్లో బారులుతీరారు. పదేండ్లుగా లేని ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే చుక్కలు చూపిస్తుందని రైతులకు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రా ల్లో ధాన్యం కొనుగోలు చేయక తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వం జీలుగ విత్తనాలు అందించడంలోనూ రైతులకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభు త్వం ఒక పక్క రైతులకు ఇబ్బందులు కలగడం లేదని చెబుతున్నా రైతులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. విత్తనాలు సరిగ్గా అందకపోవడంతో రైతులు సంబంధిత వ్యాపారితో వాగ్వాదానికి దిగారు.

**సరిపడా విత్తనాలు : ఏవో**

జీలుగ విత్తనాలు సరిపడా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. రామాయంపేటలోని పలు వ్యాపార కేంద్రాల్లో జీలుగ విత్తన సంచులను రైతులకు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఒక్కరోజే 500 జీలుగ విత్తన బ్యాగులను రైతులకు అందజేశామని చెప్పారు. మొదట ఒక్కో బ్యాగును మాత్రమే అందజేశామని, చుట్టుపక్కల మండలాల నుంచి రైతులు పెద్దఎత్తున వచ్చి విత్తనాలు కొనుగోలు చేశారని చెప్పారు.



రామాయం పేట రైతు ఆగ్రో సేవాకేంద్రంలో జీలుగ విత్తనాల కోసం బారులుతీరిన రైతులు

# మామిడిలో నూతన వంగడాలు సృష్టించాలి

- రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి
- దేశ, విదేశాల్లో మన మామిడికి గుర్తింపు
- సంగారెడ్డి జిల్లాలో 15 వేల ఎకరాల్లో సాగు
- ఎఫ్‌ఆర్‌ఎస్ మామిడి పండ్ల ప్రదర్శనలో కలెక్టర్
- విద్యార్థులు, శాస్త్రవేత్తలను అభినందించిన కలెక్టర్ క్రాంతి



సంగారెడ్డిలో ప్రదర్శనలో ఉన్న మామిడి పండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్/సంగారెడ్డి, మే 22: మామిడిలో కొత్త కొత్త రకాలు రూపొందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. జిల్లాలో మామిడి సాగు ముఖ్యమైనదన్నారు. రెండు రోజులుగా సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న మామిడి రకాల ప్రదర్శనను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. 477 మామిడి పండ్ల రకాలకు గానూ ప్రదర్శనలో 250 రకాలను ఉంచారు. ఆయా మామిడి రకాలను పరిశీలించిన కలెక్టర్ రైతులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మామిడి తోటల్లో భాగంగా జిల్లాలో మామిడి సాగు ఎంతో ముఖ్యమైనదని పేర్కొన్నారు. మామిడి విస్తీర్ణం 14 నుంచి 15 వేల ఎకరాల్లో జరుగుతున్నదని, మామిడి పండ్లలో మెరుగైన రకాలను తయారు చేసి ప్రజలకు అందించి నాణ్యమైన రుచులను చేరువ చేయాలన్నారు. ముఖ్యంగా మామిడి తోటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి పూర్తిగా సేంద్రియ ఎరువులతో పెంచితే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. రైతుల సమస్యలను ఉద్యానవన శాఖ, శాస్త్రవేత్తలు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ఫల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర మాట్లాడుతూ హస్తబల్ అని పిలువబడే గుర్రపు శాఖలో 470 రకాల మామిడి జన్యు సంపత్తికి ఎలా నిలయమయ్యిందనే విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, సహాయ అధికారులు శైలజ, సమంత, స్పందన, కీర్తి, ఫల పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ హరిషంత్, డాక్టర్ మాధవి, డాక్టర్ మౌనిక, డాక్టర్ నితీశ్, ఏవో యుగంధర్, మామిడి రైతులు పాల్గొన్నారు.

## హరితహారం చెట్లు నరికివేత

సిద్దిపేట, మే 22: ఆకుపచ్చ సిద్దిపేట నిర్మాణమే లక్ష్యంగా పట్టణంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు సిద్దిపేట పట్టణానికి పచ్చదనంతోపాటు చల్లదనాన్ని ఇస్తున్నాయి. కానీ విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తాకి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందంటూ విద్యుత్ సిబ్బంది ఇష్టారీతిన ఏపుగా పెరిగిన చెట్లను మొదటికే నరికి వేస్తున్నారు. విద్యుత్ వైర్లకు తాకుతున్న కొమ్మలను మాత్రమే కటింగ్ చేయాలని అధికారులు చెబుతున్నప్పటికీ విద్యుత్ సిబ్బంది మాత్రం చెట్లను పూర్తిగా నరికివేస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్ డీఈ మహేశ్‌ను నమస్తే తెలంగాణ సంప్రదించగా తాము ఎక్కడా చెట్లు నరకమని చెప్పలేదని, కేవలం కొమ్మలు మాత్రమే కటింగ్ చేయాలని చెప్పామన్నారు.



సిద్దిపేట పట్టణంలోని పలు రహదారుల పక్కన చెట్లను నరికిన విద్యుత్ సిబ్బంది

## ఏడుపాయల్లో పల్లకీ సేవ



ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో బుధవారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకొని పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు భాజాభజంత్రీల మధ్య అమ్మవారి ఆలయం వరకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ మండపం రాజగోపురం మీదుగా శివాలయం వరకు ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

-పాపన్నపేట, మే 22